ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 7 అక్టోబరు 2024 | 5



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ద్వాదశ శక్తిపీఠంగా ఖ్యాతిగాంచిన ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, శ్రీచక్రనవావర్ణార్చన, సాయంత్రం లక్ష కుంకుమార్చన, సువర్ణ, రజత పుష్పార్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మంత్రి సుభాష్ అమ్మవారిని దర్శించుకున్నారు.

● ద్రాక్షారామ



అమలాపురంలో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదేవి అమ్మవారు

● అమలాపురం టౌన్



అమలాపురంలో వైష్ణవి కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం



రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో అమ్మవారు..



అంబాజీపేటలో లలితాదేవి అలంకరణలో వాసవీ మాత



ద్రాక్షారామ: అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన మాణిక్యాంబ

ఆయిల్‌పామ్ రైతుల ఆనందం

దిగుమతి సుంకం పెంచడంతో పెరిగిన ధర

నష్టాల్లో ఉన్న రైతులకు భారీ ఊరట



అయినవిల్లి, అక్టోబరు 6: గత రెండు సంవత్సరాల నుంచి గిట్టుబాటు ధర లేక విలవిల్లాడుతున్న ఆయిల్‌పామ్ రైతులు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచడంతో ధరలు పెరిగి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలైనప్పుడు దిగుమతులు నిలిచిపోవడంతో ఆయిల్‌పామ్ గెలలు టన్ను రూ.24 వేలకు చేరింది. తర్వాత దిగుమతి సుంకం తగ్గించడంతో టన్ను గెలలు రూ.13,500కు చేరింది. ఉత్పత్తి వ్యయాలు పెరిగిపోవడంతో రైతులకు ధర గిట్టుబాటు లేక గత రెండు సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 20 శాతం, ఇతర పన్నులను 7.5 శాతం పెంచడంతో పామాయిల్ గెలలు టన్నుకు రూ.17 వేలకు చేరుకుందని రైతులు అంటున్నారు. టన్నుకు రూ.20వేలు ధర ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. టన్ను గెలలు ఉత్పత్తి చేయడానికి రూ.18 వేలు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో 5.66 లక్షల ఎకరాల్లో 1.74 లక్షల రైతులు పామాయిల్‌ను సాగు చేస్తున్నారు. 18.95 లక్షల టన్నుల గెలలు ఉత్పత్తి అవుతున్నాయి. సాగుకు అనువుగా ఉండడంతో డెల్టా ప్రాంతాల్లో కూడా ఆయిల్‌పామ్ సాగును రైతులు చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా కొబ్బరి ధర, దిగుబడి లేకపోవడంతో కొన్నిచోట్ల రైతులు కొబ్బరిలో అంతరపంటగా ఆయిల్ ఫాం సాగు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం పామాయిల్ రైతులకు రాయితీ బకాయిలు చెల్లించలేదని, కూటమి ప్రభుత్వం రాయితీలు చెల్లించి రైతులకు న్యాయం చేయాలని పామాయిల్ రైతులు కోరుతున్నారు.

కత్తితో కిరాతకంగా నరికి..

తమ్ముడిని చంపిన అన్నయ్య..

తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో ఘటన

6లో

ధరలకు రెక్కలు కొంటే చుక్కలు

ఆకాశాన్నంటుతున్న కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు

సామాన్యులకు పెను భారం

వర్షాలకు దెబ్బతిన్న కూరగాయల పంట

పడిపోయిన దిగుబడి..ధరలు పైపైకి

(మండపేట/ఆలమూరు)

మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. నూనెల ధరలు సలసల కాగుతుంటే నిత్యావసరాల ధరలు కూడా అదే రేంజ్‌లో పెరిగిపోతున్నాయి. మరోపక్క బియ్యం ధరలు కూడా పెరిగిపోయాయి. మార్కెట్‌లో వంట నూనె కిలో మొన్నటివరకు రూ.110 ఉండగా నేడు రూ.135కి చేరింది. 15 రోజులు వ్యవధిలోనే సుమారు 20శాతంపైగా పెరిగింది.



ధరలు పైపైకి



హోల్ సేల్ మార్కెట్‌లోనే రూ.50 నుంచి రూ.70 వరకు కిలో ధర పలుకుతుంటే రిటైల్ మార్కెట్‌లో పలు కూరగాయల ధర రూ.వంద పైబడి అమ్మకాలు సాగుతున్నాయి. గోదావరి జిల్లాల్లో లంక భూములలో కూరగాయల సాగు అధికంగా జరుగుతుంది. ఇక్కడ పండించిన పంటలు ఆలమూరు మండలం మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుంటాయి. అయితే ఈ ఏడాది కూరగాయల పంటలు వర్షాలు, వరదలకు దెబ్బతినడంతో దిగుబడి లేకుండా పోయాయి. అక్కడక్కడ మెరక ప్రాంతాలలో సాగు చేస్తున్న రైతుల ద్వారా కూరగాయలు మడికి మార్కెట్‌కు చేరుకుంటున్నాయి.

పప్పుల ధరలూ అంతే..

వంటింట్లో నిత్యం వాడే పప్పుల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోవడంతో సామాన్యులు వాపోతున్నారు. కందిపప్పు గతేడాది కిలో రూ.140 ఉంటే నేడు రూ.180కి చేరింది. పెసరపప్పు కిలో రూ.110 నుంచి రూ.130కి చేరింది. శనగపప్పు కిలో రూ.80 నుంచి రూ.120కి చేరింది. పంచదార కిలో రూ.38 నుంచి రూ 42కి పెరిగింది. చింతపండు కిలో రూ.100 నుంచి రూ.140కి పెరిగింది.

రైతులకు మిశ్రమ ఫలితాలు

కూరగాయల ధరలు పెరుగుతుంటే రైతులకు లాభాల పంట పండుతుంది. ప్రతీ సంవత్సరం కార్తీక మాసానికి ముందుగా కూరగాయల తోటలు దిగుబడికి వస్తాయి. దీంతో ధరలు తగ్గిపోయి కార్తీకమాసం కోసం ఎదురు చూస్తుంటారు. ఈసారి అందుకు విరుద్ధంగా ఉంది పరిస్థితి. కూరగాయల పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే మెరకప్రాంతంలో పండిస్తున్న రైతులకు మాత్రం లాభాల పంట కురిపిస్తోంది.

బియ్యం ధరలు..

బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. గతేడాది క్వింటా సన్నబియ్యం రూ.5000 ఉంటే ఇప్పుడు రూ.7000 వరకు చేరింది. నెల వ్యవధిలో పెరుగుదల ప్రభావం చూపింది. పాత బియ్యం ధరలు కూడా పెరిగిపోయాయి.



దొండ 'ధర'హాసం

దొండకాయలు సాగు చేసే రైతులకు ధరలు ఊరటనిస్తున్నాయి. ఒక్కొక్కసారి దొండకాయల ధరలు గణనీయంగా పడిపోయి కోత కూలీ కూడా రాని పరిస్థితి ఉంటుంది. అయితే ప్రస్తుతం దొండసాగు చేస్తున్న రైతులకు మంచి లాభాలు వచ్చిపడుతున్నాయి. రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.60 వరకు ధర పలుకుతోంది.



	నెల రోజుల క్రితం పది కిలోలు	ప్రస్తుత ధరలు పదికిలోలు
1. వంకాయలు(తెలుపు)	రూ.350లు	రూ.700లు
వంకాయలు నలుపు	రూ.250లు	రూ.450లు
2. బెండకాయలు	రూ.300లు	రూ.500లు
3. దొండకాయలు	రూ.250లు	రూ..480లు
4. కాకరకాయలు	రూ.150లు	రూ.350లు
5. టమోట (25 కిలోలు)	రూ.800లు	రూ.1500లు
6. బీరకాయలు	రూ.550లు	రూ.600లు
7. బంగాళాదుంప	రూ.300లు	రూ.350లు
8. కొత్తిమిర (కిలో)	రూ. 150లు	రూ.250లు
9. ఆనబకాయ (ఒకటి)	రూ.6-8లు	రూ.25-35లు
10. పచ్చిమిర్చి	రూ.400లు	రూ.300లు

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

కార్తీక మాసంలో కూరగాయల ధరలు పెరగడం సహజమే..కానీ ఇంకా కార్తీక మాసం రాకుండానే కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. వరుస తుఫాన్లు, పంట మునిగిపోవడం తదితర కారణాలతో దిగుబడి దారుణంగా దెబ్బతింది. ముఖ్యంగా కూరగాయలు ఎక్కువగా పండించే లంక భూములు రెండు మూడు నెలలుగా పలు దఫాలు వరదలు రావడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడులు లేక కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. నెల రోజల క్రితం వరకు కొంచెం అటూఇటుగా ఉన్న ధరలు గత వారం పది రోజులుగా దిగుబడులు మరింత క్షీణించడంతో చుక్కలు చూపిస్తున్నాయి.

నేడు మండపేటలో

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అర్జీలు స్వీకరించేందుకు

హాజరుకానున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మండపేట, అక్టోబరు 6: మండపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని కలెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మండపేటలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో అధికారులంతా మండపేటలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొంటారని తెలిపారు. సోమవారం మండపేట మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కోసం మండల పరిషత్ అధికారులు మండల సమావేశం జరిగే హాలును సిద్ధం చేశారు. మండపేటలో జరిగే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి అర్జీలు తీసుకెళ్లాలన్నారు.

పార్టీలకతీతంగా సిండికేట్

కోనసీమలో మద్యం దుకాణాలకు

300 దరఖాస్తులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు వ్యాపారులు సిండికేట్ అయ్యారు. లాబీయింగ్‌లతో రాజకీయ పార్టీలకు అతీతంగా మద్యం వ్యాపారులంతా ఒక్కటై సిండికేట్లకు రూపకల్పన చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 133 ప్రభుత్వ మద్యం దుకాణాల కోసం ఇప్పటి వరకు 300కు పైగా దరఖాస్తులు దాఖలైనట్టు సమాచారం. రానున్న మూడు రోజుల గడువులో వీటి సంఖ్య మరింత పెరగనుంది. టీడీపీ, వైసీపీ, జనసేనతో సహా ఆయా పార్టీల్లో ఉండే కీలక మద్యం వ్యాపారులు రాజకీయాలు పక్కనపెట్టి మద్యం వ్యాపారంలోకి వచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఎక్కడికక్కడే షాపుల కోసం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈ సారి కోనసీమలోని మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నట్టు సమాచారం. నూతన ప్రభుత్వ మద్యం పాలసీ విధివిధానాల్లో భాగంగా కోనసీమ జిల్లాకు వాస్తవానికి 150 షాపులు రావాల్సినప్పటికీ ప్రభుత్వ మార్గదర్శకాలతో వాటిని కుదించడం వల్ల 133 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడానికి ఇటీవల నోటిఫికేషన్ జారీ అయింది. దీనిలో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి మద్యం షాపులకు అప్లికేషన్స్ స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని వివిధ ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో సుమారు 300 దరఖాస్తులు చేసుకున్నట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సాధనాల కనకదుర్గావరప్రసాద్ తెలిపారు. రాజోలు, రామచంద్రపురం, కొత్తపేట, ఆలమూరు, ముమ్మిడివరం, అమలాపురం, స్టేషన్ల పరిధిలో ఈ దరఖాస్తులు అందినట్టు తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగియనుంది. ఈ నెల 11వ తేదీన శుక్రవారం అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల గోదావరి భవన్‌లో దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ పర్యవేక్షణలో లక్కీడ్రా తీయనున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. మూడు విధానాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లతో పాటు హైబ్రీడ్‌గా కూడా వీటిని స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా మద్యం షాపుల కోసం దరఖాస్తులు అందుతున్నట్టు సమాచారం. ఈసారి ఎక్కువమంది మద్యం షాపుల కోసం ఎగబడుతున్నట్టు తెలిసింది. దీనిలో భాగంగా షాపుల వారీగా వ్యాపారులను సిండికేట్ చేసే పనిలో కొందరు పైరవీకారులు సిద్ధమయ్యారు. ఎక్సైజ్ స్టేషన్‌లోని సిబ్బందితో ఉండే లాబీయింగ్‌ల నేపథ్యంలో ఈ పైరవీలు భారీగా జరుగుతున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఈ నెల 11వ తేదీన జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ పర్యవేక్షణలో అమలాపురం నల్లవంతెన వద్ద గల కలెక్టరేట్ ప్రాంగణంలోని గోదావరి భవన్‌లో లక్కీ డ్రా నిర్వహించడానికి ఎక్సైజ్‌శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత 12వ తేదీన లక్కీడ్రా అని భావించినప్పటికీ ఒకరోజు ముందుకు తేదీ మార్చారు. శుక్రవారం లక్కీడ్రాలో ఎంపికైన విజేతలు విజయదశమి రోజున ప్రారంభించుకునేలా సన్నాహాలు జరుగుతున్నాయి.



కూష్మాండ రూపంలో అపర్ణాదేవి

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం విశేష పూజలు జరిగాయి. అపర్ణా అమ్మవారిని కూష్మాండదేవి రూపంలో డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి అలంకారం జరిపి కుంకుమ పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- గొల్లప్రోలు రూరల్



సహస్ర దీపాల వెలుగులో ఊయలలో దుర్గామల్లేశ్వరి

పిఠాపురం రూరల్, అక్టోబరు 6: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం రాపర్తిలో వేంచేసియున్న దుర్గామల్లేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సహస్ర దీపాల మధ్య అమ్మవారి ఊయల సేవ భక్తులను తన్మయత్వంలో ముంచెత్తింది. భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గాజుల అలంకారంలో విజయదుర్గ అమ్మవారు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం చిన కొత్తలంకలో విజయదుర్గ అమ్మవారిని ఐదు వేల గాజులతో విశేషంగా అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- ముమ్మిడివరం



వారాహి దివ్య అలంకరణలో

ఐశ్వర్యాంబిక

మహాశక్తి యాగంలో నాలుగో రోజు సౌభాగ్య పూజ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 6: కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం ఆదివారం నాలుగో రోజుకు చేరింది. శతకోటి కుంకుమార్చన 29 కోట్లకు చేరుకుంది. స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో శతకోటి కుంకుమార్చనలు, లలిత పారాయణ నిర్వహించారు. ఐశ్వర్యాంబిక అమ్మవారికి వారాహీ దేవిగా దివ్యాలంకరణ చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్త్రీమూర్తుల సౌభాగ్యం కోసం సౌభాగ్య పూజతో పాటు అర్గళ, కీలక, వారాహి హోమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు స్వామీజీ అనుగ్రహభాషణ చేశారు. వారాహి అంటే లలితా స్తోత్రంలో విశుక్ర ప్రాణహరణ వారాహీ వీర్యనందిత అని అర్థమన్నారు. వారాహి గొప్ప శక్తివంతురాలని, అంతటి శక్తివంతులైన అమ్మవారి అలంకరణ శ్రీపీఠంలో జరగడం చారిత్రకమన్నారు. ప్రతి ఒక్కరి హృదయంలో దైవం, ధర్మం, దీక్ష అనే గొప్ప సంకల్పం ఉందో దానిని వెలికితీసేందుకు ఈ మహాశక్తి యాగం మరింత దోహదం చేస్తుందన్నారు. సుమారు 30వేల మంది మాతృమూర్తులు శతకోటి కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణ పూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



హోమ క్రతువులో వేద పండితులు



లలితాదేవి అవతారంలో దుర్గాదేవి

తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరులో దేవీ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఏడీబీ రోడ్డులో వున్న శ్రీవిజయదుర్గాదేవిని ఆదివారం అమ్మవారికి పుష్పాలంకరణ చేశారు. అమ్మవారు శ్రీలలితాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు చేశారు.

- రంగంపేట

శ్రీమహాలక్ష్మీదేవిగా

దేవీచౌక్ అమ్మవారు



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 6: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీబాలాత్రిపురసుందరీ దేవి అమ్మవారు భక్తులకు శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆదివారం కావడంతో నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో దేవీచౌక్ కూడలి జనసంద్రమైంది. కంబాలచెరువు, గోకవరం బస్టాండు, ఇటు రామచంద్రరావుపేట, లక్ష్మీవారపుపేట, జాంపేట రహదారులు భక్తులతో సందడిగా మారాయి. భారీ సెట్టింగులు, విద్యుత్ దీపాలంకరణలను చూసి చిన్నారులు ఉత్సాహంగా గడిపారు. ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు జరిపి మంగళ హారతి ఇచ్చారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి పది గంటలకు భీమవరం ఘంటసాల ఆర్కెస్ట్రా సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆదిత్య ఎస్ఎస్ఎస్ వీవో డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో వలంటీర్లు సేవలు అందిస్తున్నారు.



మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శారదాదేవిగా రత్నగిరి వనదుర్గమ్మ



అన్నవరం, అక్టోబరు 6: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు ఆదివారం శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం కుంకుమార్చనలు నిర్వహించారు.

నేటి నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

కాకినాడ సిటీ, అక్టోబరు 6: జాతీయ తపాలా వారోత్సవాలను సోమవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 7న తపాలా పార్సిల్ సేవల్లో వచ్చిన మార్పులు, విదేశాలకు పార్సిల్స్ పంపడానికి ప్రారంభించిన సేవలు, మరింత మెరుగైన ఉత్తరాల బట్వాడా కోసం అవగాహన కల్పిస్తామన్నారు. 8న ఫిలాటలీ దినోత్సవం సందర్భంగా డాయ అఖర్ ఉత్తరాలు, క్విజ్ పోటీలు జరుపుతామన్నారు. 9న అంతర్జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా మాతృమూర్తి పేరున 'ఒక మొక్క' అంశంపై మొక్కలు నాటుతామన్నారు. 10న రాజవొమ్మంగి, పిఠాపురం, జి.మామిడాడ, సామర్లకోట కార్యాలయాల్లో ఆధార్ నమోదు మార్పులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. 11న సామాన్యులకు ఆర్థిక తపాలా జీవిత బీమా పాలసీలు, ఐపీపీబి సేవలపై అవగాహన కల్పించి కొత్త ఖాతాలు ప్రారంభిస్తామని చెప్పారు.

జాతీయ స్థాయిలోనూ రాణించాలి

» హెక్సేర్ డివోస్ ప్రాక్టీస్ సంస్థ ఉపాధ్యక్షుడు వినోద్‌వర్మ » దివాన్‌చెరువు 'శ్రీప్రకాష్'లో ముగిసిన సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్ పోటీలు

దివాన్‌చెరువు, అక్టోబరు 6: జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లోనూ బాగా రాణించి విజయాలు సొంతం చేసుకోవాలని బెంగళూరుకు చెందిన హెక్సేర్ డివోస్ ప్రాక్టీస్ సంస్థ ఉపాధ్యక్షుడు జి.వినోద్‌వర్మ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో నాలుగు రోజులు జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఆతిథ్య పాఠశాల శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టరు సీహెచ్ విజయప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన వినోద్ వర్మ మాట్లాడుతూ క్రీడాకారులకు అంకితభావం, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరం అన్నారు. మన దేశం తరపున జెర్సీ వేసుకుని ఆడే స్థాయికి మీ క్రీడా ప్రయాణం సాగాలని విజేతలకు ఉద్బోధించారు. విశిష్ట అతిథి, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టరు విజయప్రకాష్ మాట్లాడుతూ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడాకారులు తరచూ క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. విజయం సొంతమైతే అది ప్రేరణ అవుతుందని చెప్పారు. ఒకవేళ ఓటమి ఎదురైనా నిరాశ చెందకూడదని, దానిని సాధనగా భావించి విజయం వైపు పయనించాలన్నారు. విజేతలను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆశీర్వదించారు. కో-ఆర్డినేటర్ ఎం.గంగాధర్ మాట్లాడుతూ ప్రథమ స్థానంలో నిలిచిన వారు ఈ నెల చివరి వారంలో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.వెంకట్,సీబీఎస్ఈ పరిశీలకుడు పీఏ కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజరు ఏఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. విజేతలకు పతకాలు, కప్‌లను అతిథులు అందజేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోచ్‌లు, పీడీలు, క్రీడాకారులు మాట్లాడుతూ శ్రీప్రకాష్ పాఠశాలలో పోటీలు నిర్వహించిన విధానాన్ని కొనియాడారు.

విజేతలు వీరే: అండర్-14లో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్ (ప్రథమ), రంగారెడ్డి జిల్లా పార్ఛ్యూన్‌బటర్‌ఫ్లై పాఠశాల (ద్వితీయ), విజయవాడ హీల్ స్కూలు, చిత్తూరు శ్రీభానోదయ స్కూలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి.

అండర్-17లో రంగారెడ్డి జిల్లా పార్ఛ్యూన్ బటర్‌ఫ్లై స్కూలు (ప్రథమ), ఖమ్మం గోర్కీ పబ్లిక్ స్కూలు (ద్వితీయ), హైదరాబాద్ ప్రగతి సెంట్రల్ స్కూలు, నాచారం ఢిల్లీ పబ్లిక్‌స్కూలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి.

అండర్-19లో విజయవాడ హీల్ స్కూలు (ప్రథమ), నెల్లూరు అక్షర విద్యాలయ (ద్వితీయ), రంగారెడ్డి పార్ఛ్యూన్ బటర్‌ఫ్లై స్కూలు, హైదరాబాద్ ఎక్సిలేన్షియా స్కూలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ఆయా జట్ల సభ్యులు పతకాలు, బహుమతులు అందుకున్నారు.



బహుమతి ప్రదానోత్సవ సభలో విజేతలతో అతిథులు

నేటి నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్

దివాన్‌చెరువు, అక్టోబరు 6: ఏపీ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 బాలురు హ్యాండ్‌బాల్ రాష్ట్ర టోర్నమెంటు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి ఆదివారం తెలిపారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ క్రీడా మైదానంలో సోమవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు జరిగే క్రీడలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించామని స్వామి చెప్పారు.



పార్వతికి బంగారు పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ నరసింహం

చదువుల (బంగారు) తల్లి

మెడిసిన్‌లో ఏడు బంగారు పతకాలు అందుకున్న పార్వతి

సామర్లకోట, అక్టోబరు 6: కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబీ బీఎస్ పూర్తిచేసిన సామర్లకోటకు చెందిన చంద్రాభట్ల పార్వతి ఎన్టీఆర్ యూనివర్సిటీ పరిధిలో రెండో ర్యాంకర్‌గా నిలిచింది. శనివారం రాత్రి రంగరాయలో జరిగిన కళాశాల 66వ వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్, డీఎంఈ డాక్టర్ డీఎస్వీఎల్ నరసింహం నుంచి ఏడు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందుకుంది. కంచి మహా సంస్థానం వ్యవస్థాపకుడు చంద్రాభట్ల చింతామణి గణపతి శాస్త్రి సోదరుడు, చంద్ర షిప్పింగ్ ఏజన్సీస్ మేనేజింగ్ పార్టనర్ చంద్రాభట్ల పతంజలి శాస్త్రి మూడవ కుమార్తె పార్వతి. భవిష్యత్తులో జెనెటిక్ మెడిసిన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలన్నదే తన లక్ష్యమని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో హౌస్ సర్జన్‌గా సేవలందిస్తున్న పార్వతి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పింది.

కత్తితో కిరాతకంగా నరికి...

తమ్ముడిని చంపిన అన్నయ్య... తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో ఘటన

తాళ్లరేవు, అక్టోబరు 6: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో అన్నదముల మధ్య ఆస్తి వివాదం ఒకరి హత్యకు దారితీసింది. తమ్ముడిని అన్నయ్య చంపేయడంతో ఈ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పి.మల్లవరానికి చెందిన వెంటపల్లి ఏడుకొండలు, నూకరాజు అన్నదమ్ములు. వీరి తండ్రి నాగభూషణం ఇంత క్రితమే మరణించాడు. తల్లి నాగరత్నం ఇటీవలే మృతి చెందింది. అన్నదమ్ములిద్దరూ వారి కుటుంబాలతో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. వారికున్న మూడు ఎకరాలు, ఇంటి స్థలాన్ని రెండో కుమారుడు నూకరాజు (47) పేరున తల్లిదండ్రులు పూర్వమే రాసేశారు. దీంతో అన్నదమ్ముల మధ్య వివాదాలు చోటుచేసుకుని గొడవలు ముదిరిపోయి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. చాలాసార్లు కోరింగ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఆదివారం ఉదయం తమ్ముడు నూకరాజు ఇంటి దగ్గర తోటలో కొబ్బరి కాయలు తీయిస్తుండగా అన్నయ్య ఏడుకొండలు వెనుక నుంచి కత్తిపట్టుకుని వచ్చాడు. కుటుంబ సభ్యులు, కొబ్బరికాయల కొనుగోలుదారులు చూస్తుండగానే తమ్ముడిని అన్నయ్య కత్తితో అతి కిరాతంగా నరికి పరారయ్యాడు. నూకరాజు తీవ్ర రక్తస్రావంతో అక్కడిక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ, కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన నూకరాజు (పాత చిత్రం)

దొమ్మేరు సొసైటీలో చోరీ



కొవ్వూరు, అక్టోబరు 6: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. సొసైటీ కార్యదర్శి కేఎస్ఆర్‌వీఎస్ఎల్ఎన్‌వీ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... సిబ్బంది ఈ నెల 5వ తేదీన ప్రతిరోజూ మాదిరిగా సొసైటీకి తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఎరువులను విక్రయించడానికి సేల్స్‌మెన్ ఎంఎన్ రాయుడు, హమాలీ ఎన్.గణపతి సొసైటీ గొడౌన్ ఓపెన్ చేయగా దొంగతనం జరిగిందని గుర్తించి సమాచారం అందించారు. గొడౌన్ వెనుకవైపు కిటికీని తొలగించి రూ.10వేల నగదు దొంగిలించారు. భవనం మొదటి అంతస్తులో ఉన్న కార్యాలయ వెనుక కిటికీని తొలగించి లోపలికి ప్రవేశించి సీసీ కెమెరాల డీవీఆర్, బీఎస్ఎన్ఎల్ మోడెం దొంగిలించుకుపోయినట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విశ్వం సంఘటనాస్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. సొసైటీ కార్యదర్శి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏ తల్లి పేగు బంధమో!

చెత్తకుప్పలో పసికందు మృతదేహం



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 6: తల్లి పొత్తిళ్లలో వెచ్చగా నిదురించాల్సిన పసికందు కంపు కొట్టే చెత్తకుప్పలో విగతజీవిగా పడి ఉంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం తుమ్మలావలోని జయరాం థియేటర్ సెంటర్లో ఆది వారం ఈ దారుణం చోటుచేసుకుంది. ఉదయం 8 గంటల సమయంలో రోడ్డు పక్కనే చెత్తలో బొడ్డూడని ఆడ శిశువు మృతదేహం కనిపించింది. దీనిని చూసిన స్థానికులు నిర్ఘాంతపోయారు. బతికివుందని దగ్గరకు వెళ్లి చూడగా మృతదేహమని నిర్ధారించుకున్నారు. ఇది అక్కడి మాతృమూర్తులను కదిలించింది. ఆడబిడ్డను, అందులోనూ బొడ్డుకూడా ఊడని పసి కందును చూసి తల్లుల కళ్లు చెమర్చాయి. శిశువు శరీరాన్ని ఈగలు, చీమలు పట్టి ఉండడం చపరులను కదిలించింది. ఈ విషయాన్ని త్రీటౌన్ పోలీసులకు తెలియజేయడంతో సీఐ అప్పారావు సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. పసికందు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పుట్టిన వెంటనే శిశువు మరణించి ఉంటుందని, అనంతరం చెత్తకుప్పలో పడేసివుంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వివాహం కాకుండా గర్భిణి కావడం, మరేదేనా కారణంతో పడేసి ఉంటారా... ఈ ప్రాంతంలోని వారా లేక బయటి నుంచి వచ్చి ఇక్కడ వదిలేశారా అన్న కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు.

ఏవోబీలో విస్తృత తనిఖీలు

మోతుగూడెం, అక్టోబరు 6: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. సీఆర్‌పీఎఫ్ క్యాంపులను అప్రమత్తం చేశారు. వై.రామవరం మండలం డొంకరాయిలో ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు ఏరియా డామినేషన్ నిర్వహించారు. ఆంధ్రా నుంచి ఒడిశా వెళ్లే రహదారిలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి అనుమానితులను ప్రశ్నిస్తున్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివకుమార్, సిబ్బంది

పొలానికి బయల్దేరి... తిరిగిరాని లోకాలకు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తొండంగి, అక్టోబరు 6: ఉదయం పొలానికి బయల్దేరిన వ్యక్తి అక్కడకు వెళ్లేలోపే మృత్యుఒడికి చేరుకున్నాడు. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి వద్ద ఆదివారం జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి... గొర్సపాలెం గ్రామానికి చెందిన నేమాల ఉప్పాక (50) ఆదివారం ఉదయం తొండంగి సమీపంలో ఉన్న పొలానికి మోటారు సైకిలుపై ఇంటి నుంచి బయల్దేరాడు. ఒంటిమామిడి సెంటరులో బీచ్ రోడ్డు నుంచి తొండంగి రోడ్డులోకి రాగా వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొంది. లారీ చక్రాలు అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య కొండమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎడ్ల బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఉప్పాక మరణంతో ఆ కుటుంబానికి ఆసరా లేకుండా పోయిందని బంధువులు వాపోతున్నారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో స్నానానికి దిగిన యువకుని మృతి

తొండంగి మండలం వేమవరంలో ఘటన

తొండంగి, అక్టోబరు 6: సముద్ర స్నానానికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. కాకినాడ జిల్లా తుని మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఉరుకుట్టి చంటి (24) సోమవారం స్వామి మాలధారణలో భాగంగా సముద్ర స్నానం చేసేందుకు స్నేహితులతో పాటు వేమవరం వెళ్లాడు. స్నానం చేస్తూ మునిగిపోగా మత్స్యకారులు అతడిని బయటకు తీశారు. తునిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి తల్లి రమణమ్మ, తండ్రి గోవిందు ఉన్నారు. గ్రామంలో టైలర్‌గా జీవనం సాగిస్తున్న చంటి అందరితో చనువుగా మసలేవాడని, జూనియర్ ఎన్టీఆర్‌కు వీరాభిమానిగా ఉండేవాడని సన్నిహితులు చెప్పారు.



మృతుడు చంటి (పాత చిత్రం)

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కాట్రేనికోన, అక్టోబరు6: గెద్దనపల్లి పంచాయతీ చింతలమెరకలో విజయ లక్ష్మీదుర్గ నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సుదర్శనం వెంకటజనార్ధనా చార్యులు ఆధ్వర్యంలో ఆదివారం గోపూజ, విశ్వక్షేణ పూజ, దీక్షారాధన, సర్వ దేవత ప్రార్ధన, చతుర్వేదపారాయణం, వాస్తు పూజ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, శాంతి హోమం నిర్వహించారు. గెద్దనపల్లి, చింతలమెరక, తిమ్మాపురం గ్రామాల్లో అమ్మవారిని ఊరేగించారు. కముజు లక్ష్మీరమణారావు, వనచర్ల సత్యనారాయణమూర్తి, సంసాని అర్జున్ పాల్గొన్నారు.

టీడీపీలో కష్టించిన కార్యకర్తకు గుర్తింపు ఇవ్వాలి

అంబాజీపేట, అక్టోబరు 6: కూటమి విజయం కోసం టీడీపీలో కష్టించి పనిచేసిన కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వడంలేదని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నందంపూడిలోని వ్యవసాయ క్షేత్రంలో టీడీపీ కార్యకర్తల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల పి.గన్నవరం మండలంలో జరిగిన సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుడాల ఫణిని ఉద్దేశించి టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు ఇష్టానుసారంగా మాట్లాడటంపై సమావేశం తీవ్రంగా ఖండించింది. నామన రాంబాబు పార్టీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే నియోజకవర్గ కన్వీనర్‌ను త్వరలో నియమించాలని కోరారు. అనంతరం సేవ్ టీడీపీ కార్యకర్త అని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, పితాని కేశవరావు, యనమదల రాజబాబు, నాగవరపు అన్నవరం, మట్టపర్తి భారతి, మిద్దెల శ్రీను, మందా రాజేష్, కోట మురళీ, అరిగెల నాని, మట్టపర్తిరెడ్డమ్మ, నేదునూరి వెంకటరమణబాబు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పద్మరాజు

అంతర్వేది, అక్టోబరు 6: గుడిమూల పీఏసీఎస్ అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు రుద్రరాజు పద్మరాజు ఆదివారం టీడీపీలో చేరారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి కొత్తపేటలోని తన నివాసంలో పద్మరాజుకు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, ఆచంట నియోజకవర్గ పరిశీలకుడు రుద్రరాజు వెంకట్రామరాజు, బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, మేడిద రత్నరాజు, గూడపల్లి రమణ, బోళ్ల సతీష్‌బాబు, రుద్రరాజు రామలింగరాజు పాల్గొన్నారు.

ప్రతీ బూత్‌లో వంద సభ్యత్వాలు నమోదు చేయాలి

కె.గంగవరం, అక్టోబరు6: బీజేపీ సభ్యత్వ నమోదును కార్యకర్తలు వేగవంతం చేయాలని పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కర్రి చిట్టిబాబు కోరారు. ఆదివారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం కోటిపల్లిలో నియోజకవర్గ కోకన్వీనర్ సలాది శేఖర్ అధ్యక్షతన జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు అవసరాల రమణమూర్తి మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో వంద సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు.పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, కొత్తపేట కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్, గుర్రాల సత్యనారాయణ, ఆకేటి శ్రీకృష్ణ, కొట్టివాడ హరిబాబు, కె.సాయిరామ్ సుబ్బారావు వీర్రాజు, పట్నాల శ్రీను, శ్రీరామ్, మణికంఠ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

కొత్తపేట, అక్టోబరు6:గ్రామాల్లోరోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెంలో రూ.40లక్షలతో చేపట్టే సీసీ రోడ్లకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో అభివృద్ధి అనేది కుంటిపడిందని, మౌలిక వసతులపై దృష్టి పెట్టలేదన్నారు. సంక్షేమం, అభివృద్ధి ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని సత్యానందరావు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ త్సామా బాబు, మార్గన గంగాధర్, బండారు బుల్లితాత, కంఠంశెట్టి శ్రీనివాసరావు, యల్లమిల్లి జగన్మోహన్, పప్పుల కొత్తయ్య, బడుగు సాధుబాబు, కుడుపూడి వెంకటేశ్వరరావు, కట్టా శ్రీను, కడియం చిన్న, పప్పుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.1.40లక్షలు సాయం

ద్రాక్షారామ, అక్టోబరు6: రామచంద్రపురం మండలం ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ వరద బాధితుల కోసం రూ.1,40లక్షలు సీఎం సహాయనిధికి అందజేసింది. ఆదివారం ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయం వద్ద మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు చెక్కును అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దొడ్డా సత్తిబాబు, మండల అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, పాఠశాలల యజమానులు విజయ్, గిరీష్ ప్రభు, మల్లికార్జునరావు, సబీనా, భరద్వాజ్ అందజేశారు.


ఆత్మవిశ్వాసంతో లక్ష్యం వైపు పయనించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు6: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని అధిగమించి లక్ష్యం వైపు ముందుకు వెళ్లాలని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం వికాస, సార్థక సంస్థల ఆధ్వర్యంలో వీఎస్ఎం కళాశాలలో దివ్యాంగుల కోసం నిర్వహించిన జాబ్‌మేళాలో మంత్రి మాట్లాడారు. ఎంపికైన 38మంది దివ్యాంగులకు నియామక పత్రాలుఅందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వికాస పీడీ లచ్చారావు, మంత్రి సుభాష్ తండ్రి సత్యం పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ దర్శనం

అమలాపురంటౌన్, అక్టోబరు6: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లో శ్రీదేవి అమ్మవారిని పిండి సాయిబాబా కుటుంబ సభ్యులు అన్నపూర్ణాదేవిగా విశేష అలంకారంచేయించారు. ఆలయ ప్రాంగణంలో సామా నాగవెంకటసత్యనారాయణ, గంగాబత్తుల కృష్ణ, బొలిశెట్టి మణిశంకర్ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణదుర్గమ్మను అన్నపూర్ణాదేవిగా విశేష అలంకారం చేయించారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీవైష్ణవి కనకదుర్గమ్మను పెద్దింటి సత్యవెంకటఅనంతకృష్ణస్వామి దీక్షితులు అన్నపూర్ణాదేవిగా అలంకారం జరిపించారు. ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లుచేశారు. మెయిన్‌రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి లలితాత్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు.






అమలాపురం, ముమ్మిడివరం, మామిడికుదురు మండలాల్లో, యానాంలో వివిధ రూపాల్లో అమ్మవార్లు

లలితాదేవిగా విజయదుర్గమ్మ

ఆత్రేయపురం, అక్టోబరు 6: ఆలయాల్లో ఆదివారం మహిళలు కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉచ్చిలి విజయదుర్గాదేవి లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాడపల్లి విజయదుర్గ ఆలయంలో భవానిదీక్షాధారులు పూజలు చేశారు.

శ్రీలలితాదేవిగా అలంకరణ

పి.గన్నవరం, అక్టోబరు 6: తాటికాయల వారిపాలెంలో అమ్మవార్ని శ్రీలలితాదేవిగా ఆదివారం అలంకరించారు. శ్రీవినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి ఫణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాలు, అమ్మవారి పందిళ్ల వద్ద పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

ముమ్మిడివరం, అక్టోబరు6: ముమ్మిడివరం శ్రీవిశ్లఈశ్వరమ్మ ఆలయంలో విజయదుర్గమ్మ ఆదివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విశ్ల ఈశ్వరరావు, గణేష్ సోదరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పళ్లవారిపాలెంలోని విజయదుర్గమ్మ ఆదివారం శ్రీలలితాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లలితాదేవి అలంకరణలో వాసవీమాత

అంబాజీపేట, అక్టోబరు6: అంబాజీపేట బస్టాండ్ ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవార్ని గురువారం లలితాదేవిగా అలంకరించారు. అమ్మవార్కి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గణపతి ప్రార్థనా భక్తిగీతాలు, వాసవీ ప్రార్థన ఆలపించారు. అంబాజీపేట సంతమార్కెట్‌లోఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాజీపేట విజయభేతాళస్వామి, పక్షులరావిచెట్టు వద్ద అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

వివిధ అలంకరణల్లో అమ్మవార్లు

యానాం, అక్టోబరు 6: యానాం శివారు గిరియాంపేట రోడ్డు లోని శ్రీపాల కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం ద్వారపూడికి చెందిన దొంతికుర్తి విజయశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. పడవలరేవు వీధిలోని లలితాదేవి ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా, గోపాల్ నగర్‌లోని శారదాదేవి (సరస్వతి) ఆలయంలో అమ్మవారు రాజమాతాంగిగా, శివాలయ ప్రాంగణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న అమ్మవారి వేషధారణలు

మామిడికుదురు, అక్టోబరు6: ఆదివారం అమ్మవారి వేషధారణలు ఆకట్టుకున్నాయి. మామిడికుదురులోని విజయదుర్గమ్మను 10,116 గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పాశర్లపూడి బాడవలోని కనకదుర్గమ్మను అన్నపూర్ణాదేవిగా, పెదపట్నంరేవులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద దుర్గాదేవిని కాయగూరలతో శాకంబరిగా అలంకరించారు. మగటపల్లిలోని త్రిశక్తి పీఠంలో అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఆయా చోట్ల లక్ష కుంకుమార్చన, పలు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

లలితాత్రిపుర సుందరీదేవిగా విజయదుర్గమ్మ

రాయవరం, అక్టోబరు 6: వెదురుపాక విజయదుర్గా అమ్మవారు ఆదివారం లలితా త్రిపుర సుందరీ దేవిగా పూజలు అందుకుంది. విజయదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ జరిపి లలితా అష్టోత్తర సహస్రనామాలతో మహిళలు సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. పీఠంలో ఆధ్యాత్మికవేత్తలు యర్రాప్రగడ రామకృష్ణ అమ్మవారి అవతారాలు విశిష్టను వివరించారు. పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ మణిద్వీప నివాసినిగా విరాజిల్లే శ్రీలలితా త్రిపురసుందరీదేవిని పూజిస్తే కలిగే శుభాలను వివరించారు. మహిళలు సామూహిక లలితా సహస్రనామా పారాయణ జరిపి, చతుర్వేదస్వస్తి, దర్బారుసేవ, నీరాజన మంత్రాలు మహానివేదన జరిపారు. అనంతరం పీఠంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు అన్నసమారాధన చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీబాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే సత్యవెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, పీఠం పీఆర్వో బాబీ భక్తులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి రుద్ర చండీ హోమాలు

అల్లవరం, అక్టోబరు6: అల్లవరం విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో మంగళపల్లి పాండురంగవిఠల్ ఆధ్వర్యంలో వేదపండితులు గణపతి, రుద్ర, చండీ మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బెండమూర్లంకలో విజయదుర్గమ్మకుగిడుగు భాస్కరరావు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. కోడూరుపాడు, యెంట్రుకోన, గోడితిప్ప, గోడి, మొగళ్లమూరు, కొమరగిరిపట్నం దేవగుప్తం గ్రామాల్లో దుర్గాదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతల స్వీకరణ

అంబాజీపేట, అక్టోబరు 6: మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించారు. మాచవరం పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, కె.పెదపూడి కార్యదర్శిగా బి.అప్పారావు, పుల్లేటికుర్రు పంచాయతీ కార్యదర్శిగా వి.లక్ష్మిపతి, తొండవరం కార్యదర్శిగా డి.వరలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయ ఏవోగా ఏపీఎల్ నరసింహరావు, సీనియర్ అసిస్టెంట్‌గా వీవీ గిరిబాబు, టైపిస్టుగా కేవీఎస్ బాలదీప్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శులు, కార్యాలయాధికారులు ఎంపీడీవో సరోవర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

వృత్తి విద్య ద్వారా ఉన్నత భవిష్యత్తు

ముమ్మిడివరం, అక్టోబరు 6: వృత్తి విద్యను అభ్యసించడం ద్వారా ఉద్యోగ, అవకాశాలను పొంది ఉజ్వల భవిష్యత్తును సాధించవచ్చునని జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఎంఏకే భీమారావు పేర్కొన్నారు. అనాతవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా వృత్తి విద్యపై అవగాహన కల్పించారు. వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ కోర్సుల్లో ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసెట్ కోఆర్డినేటర్ ఎం.భుజంగరావు, ఒకేషనల్ ట్రైనర్ ఎం.ప్రవీణ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రణీత్‌వర్మ



ఆత్రేయపురం, అక్టోబరు 6: జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ టీమ్‌లో ఆత్రేయపురానికి చెందిన ముదునూరి ప్రణీత్‌వర్మకు స్థానం లభించింది. సీబీఎస్ఈ సౌత్‌జోన్ ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ రాష్ట్రాలకు చెందిన జట్లు హ్యాండ్ బాల్ పోటీల్లో అండర్-19 విభాగంలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్ తరుపున ప్రణీత్‌వర్మ ఆడిన జట్టుకు ప్రథమస్థానం లభించింది. హైదరాబాద్ మియాపూర్‌లోని రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలను సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 1 వరకు నిర్వహించారు. ఈపోటీల్లో ప్రథమ సాధించిన హ్యాండ్ బాల్ జట్టు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్టోబరు 10వరకు 4 రోజులు యూపీలోని ఘజియా బాద్ జిల్లా మోడీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో వర్మ పాల్గొననున్నారు. ఆత్రేయపురానికి చెందిన ప్రణీత్‌వర్మ పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లోఇంటర్ చదువుతూ హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి జట్టులో స్థానం సాధించడంపై గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం



మామిడికుదురు, అక్టోబరు 6: రైతులు ధాన్యాన్ని ఎక్కడైనా అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ కూటమి నాయకులు ఆదివారం నగరంలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రైతులకు ధాన్యం బకాయిలు వెంటనే విడుదల చేయడం, ర్యాండమైజేషన్ పద్ధతిని రద్దు చేయడాన్ని స్వాగతిస్తూ కౌలు రైతుల సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌలురైతుల సంఘ జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, రైతులు తాటికాయల భాస్కరరావు, తాటికాయల ఉదయ భాస్కరరావు, రాయుడు ఆనంద్, టీడీపీ నాయకులు జాలెం సుబ్బారావు, ముఖ్రం హుస్సేన్, కోళ్ల సురేష్, ఎంకే అబ్బాస్, వానరాశి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.42కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అమలాపురంరూరల్, అక్టోబరు6: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.కోటి, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.42లక్షలతో బండారులంకలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన చేశారు. గ్రామంలో ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తూ శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించి గ్రామంలో బహిరంగ సభ జరిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జనసేన మండల అధ్యక్షుడు లింగోలు పండు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కూటమి నాయకులు బండి మణికంఠ, కాశిన ఫణీంద్ర, కొండా సత్యనారాయణరాజు, చింతా అత్తిలింగం, మాడా మాధవి, చొల్లంగి సత్యసాయిబాబా, బళ్ల వీర్రాజు, కాశిన బాబి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో పర్యటన



ద్రాక్షారామలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, అక్టోబరు6: ప్రజలకు చేరువయ్యేందుకు, గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నట్టు మంత్రి సుభాష్ తెలిపారు. ఆదివారం ద్రాక్షారామ, వేగాయమ్మపేట, తోటపేట, అన్నాయిపేట గ్రామాల్లో మంత్రి సుభాష్ పర్యటించారు. గ్రామాల్లో నిర్వహించిన సభల్లో మాట్లాడారు. ద్రాక్షారామలో దశాబ్దాలుగా పరిష్కారం కాని డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించామన్నారు. త్వరలో నూతన డంపింగ్ యార్డును అందుబాటులోకి తెస్తామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టీడీపీ నాయకుడు పెంకే సాంబశివరావు, నామా వెంకన్నబాబు మాట్లాడారు. వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారాం, దొంగల శ్రీధర్, మేకా జానకిరామయ్య, గారపాటి జోగారావు, నాయకులు పాల్గొన్నారు.

గంగవరాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

కె.గంగవరం, అక్టోబరు 6: కె.గంగవరాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం రాత్రి గ్రామంలో జరిగిన మన గ్రామం మన సుభాష్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పక్షవాతంతో బాధపడుతున్న కాద పెద్ది రాజుకు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.25వేలు అందజేశారు. దీనికి గ్రామస్తులు సమకూర్చిన మరో రూ.75వేలు కలిపి రూ.లక్ష పెద్దిరాజు కుటుంబ సభ్యులకు అందజేస్తామని కూటమి నాయకులు చెప్పారు. కూటమి నాయకులు అల్లూరి దొరబాబు, నేమాని అబ్బు, నేమాని సత్యనారాయణ, కొరపాటి ప్రసాద్ చౌదరి, చిర్రా రాజ్‌కుమార్, గెద్దాడ రమణ పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారిగా శాంతాలక్ష్మి



అమలాపురంరూరల్, అక్టోబరు6: జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి ఆదివారం కామనగరువులోని డీపీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డీఎల్‌డీవోగా పనిచేస్తుండగా జిల్లా పంచాయతీ అధికారిగా కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి డీపీవోగా పనిచేస్తున్న డి.రాంబాబు తిరిగి డ్వామా ఏపీడీగా వెళ్లనున్నారు. డీపీవోను పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, కార్యదర్శి నిమ్మకాయల సాయిరామ్, కోచైర్మన్ ఆత్కూరి శరభరాజు, డి.కృష్ణాజీ, గుత్తుల వాసు, ఎ.అశోక్‌కుమార్, పి.సత్తిబాబు, టీఎస్వీ సూరిబాబు, సీసీ సత్యనారాయణమూర్తి అభినందించారు.

యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ



అమలాపురంటౌన్, అక్టోబరు6: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయులకు గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో మూడు రోజులు క్రీడా పోటీలు నిర్వహించారు. కోనసీమ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన ఉపాధ్యాయ క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు, సర్టిఫికెట్లు పొందారు. స్పీడ్ వాక్‌లో పి.ఇందిర, వంద మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్‌లలో ఎం.సురేష్ బాబు, జావెలిన్‌త్రోలో మంగతాయారు, టెన్నికాయిట్, త్రోబాల్ పోటీల్లో మహిళా ఉపాధ్యాయులు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంటీవీఎస్ సుబ్బారావు అభినందించారు.

మహిళా ఉపాధ్యాయురాలి ప్రతిభ



మండపేట, అక్టోబరు6: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఆటల పోటీల్లో మండపేట వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ యూపీ స్కూల్ (గొల్లపుంతకాలనీ) ఉపాధ్యాయు రాలు కె.దేవీలత త్రోబాల్, టెన్నికాయిట్ విభాగాల్లో ప్రతిభ చూపి విజేతగా నిలిచారు. ఆమెకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

అంతర్వేది, అక్టోబరు 6: అంతర్వేదిపాలెం వెలంకాయల కాల్వగట్టుకు చెందిన కేశవదాసుపాలెం హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ సుజాత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆదివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భర్త పాటి రాజును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, జనసేన మండలాధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్, టీడీపీ బత్తుల రాము, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ఎంఈవో బి.కిశోర్‌కుమార్, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, చొప్పల శశికుమార్, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: శ్వాగ్
శ్రీలలిత	: సెలబ్రిటి
శేఖర్ స్క్రీన్-1	: రామనగర్ బన్నీ
శేఖర్ స్క్రీన్-2	: దక్షిణ
రమా	: దేవర-1
గణపతి	: మత్తువదలరా-2
వెంకటపద్మావతిస్క్రీన్-1	: దేవర-1
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సత్యంసుందరం

తీరప్రాంత గ్రామాల్లో జోరుగా మద్యం విక్రయాలు

కాట్రేనికోన, అక్టోబరు 6: తీరప్రాంత గామాలు పల్లం, బలుసుతిప్ప, చిర్రయానాం, నీలరేవు, మొల్లేటిమొగ, కొత్తపాలెం తదితర గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అడపాదడపా పోలీసులు దాడిచేసి సూత్రధారులను వదిలిపెట్టి, స్వల్పంగా మద్యం సీజ్ చేస్తున్నారు. యానాం నుంచి ఎన్డీపీఎల్ మద్యాన్ని పడవల ద్వారా జలమార్గంలో తీరగ్రామాలకు తెచ్చి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. పల్లంలో నెలకు రూ.2లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్న బలుసుతిప్పకు చెందిన వ్యక్తి పల్లం, చిర్రయానాం, నీలరేవు గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుపుతున్నాడు. ప్రభుత్వ మద్యం దుకాణాలు రానున్న నేపథ్యంలో ఏడాదికి పల్లంలో బెల్టు షాపు నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. బలుసుతిప్పలో అధికార పార్టీకి చెందిన వ్యక్తి గ్రామానికి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. మగసానితిప్పలో అటవీశాఖ తాత్కాలిక ఉద్యోగి నాటుసారా బట్టీలు నిర్వహిస్తూ కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో పలు గ్రామాలకు సొంత బోటులో సారాను సరఫరా చేస్తున్నాడు. కోనసీమలోని పలు ప్రాంతాలకు ఇతడే నాటుసారా విక్రయిస్తున్నాడు. తీరగ్రామాల్లో మద్యం విక్రయాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెంకన్న ఆలయంలో ప్రముఖుల పూజలు

ఆత్రేయపురం, అక్టోబరు 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజభవన్ జాయింట్ సెక్రటరీ సూర్యప్రకాష్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఉపకమిషనరు నల్లం చక్రధరరావు ప్రముఖులకు స్వామివారి చిత్రపటాలు అందజేశారు. వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.4,86,688 వచ్చినట్లు ఈవో నల్లం చక్రధరరావు తెలిపారు.

డ్రాయింగ్ టీచర్లకు సత్కారం

అమలాపురంటౌన్, అక్టోబరు6: విద్యార్థి దశలో చిత్రలేఖనోపాధ్యాయుల పాత్ర అనిర్వచనీయమైనదని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆదివారం ప్రముఖ చిత్రకారులు డాక్టర్ ఉంద్రు ఆశీర్వాదం అధ్యక్షతన కోనసీమ కళాపీఠం ఆధ్వర్యంలో జిల్లాలో పనిచేస్తున్న75మంది చిత్రలేఖన ఉపాధ్యాయులను ప్రెస్‌క్లబ్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే సమక్షంలో సత్కరించారు. ప్రముఖ చిత్రకారులు ఎస్ఎస్.శర్మ, ఆకొండి అంజి, కార్టూనిస్ట్ మాడా రాము, నాగారపు సత్యనారాయణ, బీవీవీ సత్యనారాయణ, సాదా రామకృష్ణ, బత్తుల శ్రీను, గిడ్ల శ్రీను, సత్యనారాయణ (పండు), డ్రాయింగ్ టీచర్లు పాల్గొన్నారు.

లక్కవరం సబ్‌స్టేషన్ పరిశీలన

మలికిపురం, అక్టోబరు 6: లక్కవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలతో వారం రోజుల నుంచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న 5ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతికంగా ఇబ్బందులు రావడంతో వేరే వాటిని అమర్చినట్టు తెలిపారు. లోడు కెపాసిటీ సరిపోకపోవడంతో తరచూ ఇబ్బందులు వస్తున్నాయని సిబ్బంది, స్థానికులు తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే అన్నారు. ఏడీఈ శ్రీనివాస్, ఏఈఈ బొలిశెట్టి ప్రసాద్‌లు ఎమ్మెల్యేకు పరిస్థితిని వివరించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ కోట పుష్పకుమారి, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, గుండుబోగుల పెదకాపు, మంగెన నాని, మంగెన భూదేవి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మలికిపురం, అక్టోబరు 6: రామరాజులంకలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువుర్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పోతుల పుల్లారావుకు గ్రామస్తులందరూ రూ.61వేలు ఆదివారం అందజేశారు. రామరాజులంక గ్రామం ముద్దలవారి మెరకలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ముద్దల శ్రీను, బొరుసు ఉమారావు పాల్గొన్నారు.

ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండుబోగుల పెద్దకాపు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు దుశ్శాలువా కప్పి లక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని అందించారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, అక్టోబరు6: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వందలాది మంది భవానీ భక్తులు వశిష్ట రేవులో పుణ్యస్నానాలు ఆచరించి క్షేత్ర సంరక్షకుడు ఆంజనేయస్వామి, క్షేత్ర పాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వశిష్ఠాశ్రమం, అశ్వరూఢాంబిక (గుర్రాలక్కమ్మ) ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. సాయంత్రం అంతర్వేది బీచ్, లైట్‌హౌస్ ప్రాంతాల్లో భక్తులు, యాత్రికులు సందడి చేశారు. మండలంలో అమ్మవార్ల ఆలయాల వద్ద భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. లలితాత్రిపురసుందరీ దేవిగా అమ్మవారికి అలంకరణ చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



మామిడికుదురు, అక్టోబరు 6: అప్పనపల్లి బాలబాలాజీ జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1992-2003 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. గురువులకు పాదపూజలు చేసి సన్మానించారు. అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహచర మిత్రులకు ముగ్గురికి రూ.40వేలు చొప్పున అందించారు.

పూర్వ విద్యార్థుల వితరణ

మండపేట, అక్టోబరు6: మండపేట ప్రభుత్వ పాఠశాలలో 1988లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ప్రియమిత్ర సంఘంగా ఏర్పడి చేస్తున్న సేవాల కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. సంఘం తరపున మండపేటలో పదో తరగతి, ఇంటర్‌లో మెరిట్ సాధించిన 10మంది విద్యార్థులకు ఒక్కొకరికి రూ.15వేలు వంతున రూ.1.50లక్షల పురస్కారాన్ని వేగుళ్ల ద్వారా అందించారు. విజయవాడ వరద బాధితులకు సీఎం సహాయనిధికి రూ.30వేలు చెక్కును ఎమ్మెల్యే వేగుళ్లకు అందజేశారు. చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, డీవైఈవో, మండల విద్యాధికారులు, పూర్వ విద్యార్థులు ప్రసాదుల భవానీవీరకుమార్, దొంగ శ్రీనివాస్, పిసపాటి ఉబ్బారావు, ఎస్.ఎల్.ఎస్.ఆచార్యులు, అంకం వీరన్న పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు

యానాం, అక్టోబరు 5: యానాం శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి సువర్ణ పుష్పార్చన, ముత్యాల హారతి, సహస్ర నామార్చన,విశేష పూజలు నిర్వహించారు.

టీచర్స్ ఒలింపిక్స్‌లో సురేష్‌బాబుకు గోల్డ్ మెడల్



ఉప్పలగుప్తం, అక్టోబరు6: జిల్లా తరపున రాష్ట్ర స్థాయిలో గుంటూరులో జరిగిన టీచర్ ఒలింపిక్ క్రీడల్లో 100 మీటర్ల రన్నింగ్‌లో వాసాలతిప్ప హైస్కూల్ టీచర్ ఎస్.సురేష్‌బాబు గోల్డ్ మెడల్ సాధించినట్టు హెచ్ఎం ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. షాట్‌పుట్, త్రోయింగ్‌లో ద్వితీయ స్థానంతో సిల్వర్ మెడల్ సాధించాడు.యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అత్తిలి సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏవీ సూర్యం, గుత్తుల సుబ్రహ్మణ్యం, కామన మధుసూదనరావు, పెంకే వెంకటేశ్వరరావు, ఎంటీవీ సుబ్బారావు అభినందించారు.

కొత్తపేట విద్యుత్ శాఖ డీఈగా చిట్టిరాజు



కొత్తపేట, అక్టోబరు 6: కొత్తపేట సబ్‌డివిజన్ ఎలక్ట్రికల్ డీఈగా డి.చిట్టిరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలకు డివిజన్ స్థాయి అధికారిగా విధులు నిర్వహించనున్నారు. కోరుకొండ డీఈగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఫొటోగ్రాఫర్ల సంఘ నూతన అధ్యక్షుడిగా రమేష్

అమలాపురం టౌన్, అక్టోబరు 6: అమలాపురం ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా యూనియన్ ప్రెసిడెంట్‌గా జి.సురేష్, గౌరవాధ్యక్షుడిగా ఖ్వాజాబాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్టమూరు కృష్ణ, గౌరవ సలహాదారుగా గురు, దీప్తి మోహన్‌లతో పాటు యూనియన్ అధ్యక్షుడిగా చెల్లుబోయిన రమేష్(బాబి), ఉపాధ్యక్షుడిగా శివకుమార్, కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాస్, కోశాధికారిగా కోటి, ఉపకోశాధికారి శివకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బాలాజీ, సతీష్, గోపి, సుదర్శన్, రాధాకృష్ణ, హేమ్‌చరణ్, శేఖర్, టీఆర్కే కుమార్, పి.శ్రీనివాస్, సీతారాం, రాజీవ్‌లు ఎన్నికయ్యారు. అన్ని మండలాల ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, యూనియన్ సెక్రటరీలు, సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం

రావులపాలెం, అక్టోబరు 6: బీజేపీ రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణకు రావులపాలెంలో ఘన స్వాగతం లభించింది. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు ఆదివారం రావులపాలెంలో యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కొండేటి ఈశ్వరగౌడ్, కాలాబత్తుల చిన్నారి, గనిశెట్టి అరవింద్, మద్దింశెట్టి శ్రీనివాసరావు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తపేటలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

కొత్తపేట, అక్టోబరు 6: కొత్తపేట మేజర్ పంచాయతీ వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు జరిగే ప్రజాదర్బార్‌లో స్థానిక ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్టు ఆయన తెలిపారు. మండలంలోని 10 గ్రామాల ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంటకాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

ఆలమూరు, అక్టోబరు 6: చొప్పెల్ల లాకుల వద్ద పంటకాలువలో సుమారు 43ఏళ్ల గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఆమె ఒంటిపై పచ్చ రంగు జాకెట్, బిస్కెట్ కలర్ రంగు లంగా ఉంది. చొప్పెల్ల వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిస్తే ఆలమూరు ఎస్ఐ అశోక్ 9440904849, రావులపాలెం రూరల్ సీఐ 944079527 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, అక్టోబరు 6: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంకంపాలేనికి చెందిన కరపోతు లక్ష్మీప్రవీణ్‌అజయ్ (22) ఆదివారం మృతిచెందాడు. గత నెల 25వ తేదీన అతను పురుగుల మందు తాగడంతో స్థానికులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పి.గన్నవరం, అక్టోబరు 6: పి.గన్నవరం మార్కెట్ సెంటర్‌లో యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. లంకలగన్నవరానికి చెందిన మల్లాడి కళ్యాణ రాజును అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.